శాకంబరీ అలంకరణలో గండి పోశమ్మ

వీరవాసరం: మండలంలోని రైల్వే గేట్ సమీపంలో గండి పోశమ్మ తల్లి అమ్మవారిని శుక్రవారం శాకంబరీ దేవిగా ప్రత్యేక అలంకరణ చేశారు. ముందుగా అమ్మవార్లకు ప్రత్యేక కుంకుమ పూజలు, హోమాలు నిర్వహించారు. అనంతరం అనంత అఖండ అన్న సమారాధన కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించి , తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ ధర్మకర్తల మండలి, లలిత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

బాబు మోసాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

- ఏడాది పాలనలో అన్ని వర్గాలనూ మోసం చేసిన కూటమి ప్రభుత్వం
- చంద్రబాబు ఎన్నికల మ్యానిఫెస్టోలోని మోసాలను ప్రతి ఇంటికి తీసుకెళ్లాలి


సమావేశంలో మాట్లాడుతున్న గూడూరి ఉమాబాల, వేదికపై వెంకటరాయుడు తదితరులు

భీమవరం: బాబు మోసాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని వైఎస్సార్‌సీపీ నరసాపురం పార్లమెంట్ సమన్వయకర్త గూడూరి ఉమాబాల తెలిపారు. శుక్రవారం రాయలం గ్రామంలో భీమవరం నియోజకవర్గపార్టీ సమన్వయకర్త చినమిల్లి వెంకటరాయుడు అధ్యక్షతన జరిగిన పార్టీ పట్టణ ముఖ్యనాయకుల సమావేశంలో ఆమె మాట్లాడారు. భీమవరం పట్టణంలో వార్డు కమిటీ నియామకాలను వెంటనే పూర్తి చేయాలని చెప్పారు. కూటమి ప్రభుత్వం పట్ల అన్నివర్గాల ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతున్నందున ప్రజల సమస్యలపై పోరాటం చేయడానికి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలన్నారు. చినమిల్లి వెంకటరాయుడు మాట్లాడుతూ భీమవరం నియోజకవర్గంలో పార్టీని మరింత పటిష్టం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఎన్నికల్లో కూటమి నాయకులు ఇచ్చిన హామీలను ఏడాది కాలంలో అమలు చేయకపోవడంతో ప్రజలంతా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనను గుర్తుచేసుకుని కూటమి నాయకులపై మండిపడుతున్నారన్నారు. ప్రజల సమస్యలపై పోరాటాలు చేసి వాటి పరిష్కారానికి వైఎస్సార్ సీపీ పనిచేయాలన్నారు. పట్టణంలోని వార్డు కమిటీలను పూర్తి స్థాయిలో నియమించి పార్టీ పటిష్టతకు నాయకులు, కార్యకర్తలు కలసికట్టుగా కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా అధికారప్రతినిధి కామన నాగేశ్వరరావు, పార్టీ పట్టణ అధ్యక్షుడు గాదిరాజు రామరాజు, పార్టీ యువజనవిభాగం జిల్లా అధ్యక్షుడు చిగురుపాటి సందీప్, పేరిచర్ల సత్యనారాయణ రాజు, పాలవెల్లి మంగ, చిగురుపాటి రాజు, డి ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

రైతుల అభ్యంతరాలపై విచారణ

భీమవరం(ప్రకాశంచౌక్): జాతీయ రహదారి 165 నిర్మాణం విషయంలో భీమవరం, గునుపూడి, రాయలం, తాడేరు, చినఅమిరం తదితర గ్రామ రైతుల నుంచి వచ్చిన అభ్యంతరాలపై జేసీ రాహుల్‌కుమార్ రెడ్డి శుక్రవారం తన ఛాంబర్‌లో విచారణ నిర్వహించారు. భూసేకరణపై అభ్యంతరాల గడువు జూన్ 14న ముగిసిందని, అభ్యంతరాలు తెలిపిన వారితో ఆయన నేరుగా మాట్లాడారు. రైతులు వ్యక్తం చేసిన సమస్యల్ని పరిష్కరించేందుకు జాతీయ రహదారుల సంస్థ అధికారులు హామీ ఇవ్వడంతో భూ సేకరణకు సహకరించాలని జేసీ సూచించారు. ఈ విచారణలో ఎస్.హెచ్ ఆర్.అండ్.బి డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్.శ్రీనివాసరావు, తహసీల్దార్ రావి రాంబాబు, కలెక్టరేట్ ల్యాండ్ సూపరింటెండెంట్ సీహెచ్ రవికుమార్, టీడీ కల్యాణి తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



సైబర్ నేరాల అవగాహన సదస్సులో మాట్లాడుతున్న సీఐ కాళీచరణ్

భీమవరం: విద్యార్థులు సాంకేతిక నైపుణ్యాన్ని ఉపయోగించి సైబర్ మోసాలకు పాల్పడే చీకటి శక్తులపై పోరాటం చేయాలని భీమవరం టూ టౌన్ సీఐ జి కాళీచరణ్ పిలుపునిచ్చారు. శుక్రవారం భీమవరం పట్టణంలోని ఆర్ఆర్‌డీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సైబర్ నేరాల అవగాహన సదస్సుకు ఆయన ముఖ్య వక్తగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు సైబర్ నేరాలు జరుగుతున్న విధానాన్ని గమనించి వాటి బారిన పడకుండా సమాజానికి అవగాహన కలిగించాలన్నారు. డిజిటల్ అరెస్టులు, వ్యక్తిగత సమాచారాన్ని హ్యాక్ చేయడం వంటి సైబర్ నేరాల మూలాలని వివరించి, యువత పోలీసులతో సహకరించి వాటిపై ప్రతిఘటనా పోరాటాన్ని చేయాలని పిలుపునిచ్చారు. కళాశాల ప్రిన్సిపల్ వికేజె ప్రసూన మాట్లాడుతూ విద్యార్థులు గ్రామస్థాయిలో నిరక్షరాస్యులకు సైబర్ నేరాల పట్ల చైతన్యం కలిగించాలని, సైబర్ నేరాల నిర్మూలనకు నడుం బిగించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ కె రామారావు, కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ కాకుమాని శ్రీనివాసరావు, పి అరవిందస్వామి, ఎస్ లక్ష్మీకాంతం, ఎల్ నర్సింహారావు, డి ధనంజయ, జి ఉమామహేశ్వరి, డి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి ప్రజలు సహకరించాలి


మహదేవపట్నంలో గ్రామ సభలో వివరాలు వెల్లడిస్తున్న అధికారులు

ఉండి: మండలంలోని పలు గ్రామాల్లో సామాజిక తనిఖీ గ్రామ సభలను నిర్వహించారు. గత కొద్ది రోజులుగా సామాజిక తనిఖీ బృందాలు స్టేట్ రీసోర్స్ పర్సన్స్, డిస్ట్రిక్ట్ రీసోర్స్ పర్సన్స్ ఆధ్వర్యంలో జరిగిన గ్రామంలో 2024-25 ఆర్థిక సంవత్సరంలో నిర్వహించిన ఎన్ఆర్ఈజీఎస్ పనులపై నిర్వహించిన తనిఖీ రిపోర్టులు చదివి వినిపించారు. శుక్రవారం మండలంలో మహదేవపట్నం, చెరుకువాడ, యండగండి గ్రామాల్లో తనిఖీలపై గ్రామ సభలు నిర్వహించారు.ఈ సందర్భంగా మహదేపట్నంలో గ్రామ సర్పంచ్ వనిమా సుబ్బలక్ష్మీశ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన గ్రామ సభలో జిల్లా రీసోర్స్‌పర్సన్ శ్రీనివాస్ మాట్లాడుతూ గ్రామంలో గత ఆర్థిక సంవత్సరంలో రూ.45 లక్షల విలువైన 135 పనులు గ్రామంలో జరిగాయన్నారు. వాటిలో కాలువ పనుల్లో రూ.16.15 లక్షలు పనితో సంబంధం లేకుండా అధిక చెల్లింపులు చేసినట్లు ఆయన తెలిపారు. వీటితో పాటు 9107 మస్టర్లు తేడావచ్చాయని గ్రామ సభలో తెలిపారు. వీటిపై ఎన్ఆర్ఈజీఎస్ మండల టెక్నికల్ అసిస్టెంట్ ఒమేగారాజు మాట్లాడుతూ తనిఖీ అధికారులు చేసిన పనులను తప్పుగా అర్థం చేసుకుంటున్నారని వాటిపై వివరణను జిల్లా ఉన్నతాధికారులకు తెలియపరచామని త్వరలోనే మండల కేంద్రం ఉండిలో జరిగే సమాజిక తనిఖీ మండల సభలో అన్ని విషయాలు తెలుస్తాయని తెలిపారు. గ్రామాభివృద్ధికి ప్రజలంతా సహకరించి ఎన్ఆర్ఈజీఎస్ పనులు చేసుకోవాలని సర్పంచ్ వనిమా సుబ్బలక్ష్మీశ్రీనివాస్ తెలిపారు. గ్రామంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించేందుకు ఎన్ఆర్ఈజీఎస్ నిధులు మంజూరు కావాలంటే అధికంగా పనులు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కేశిరెడ్డి గోపాలకృష్ణ, ఉపాధి హామీ శ్రామికులు తదితరులు పాల్గొన్నారు.

జనాభా పెరుగుదలను నియంత్రించాలి



కాళ్లలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

కాళ్ల: ప్రపంచ జనాభా దినోత్సవం కార్యక్రమం భాగంగా కాళ్ళ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నందు వైద్యాధికారి డాక్టర్ సీ.హెచ్.వి. రంగనాయుడు ఆధ్వర్యంలో శుక్రవారం ప్రపంచ జనాభా దినోత్సవం ర్యాలీ నిర్వహించారు. అనంతరం వైద్యాధికారి మాట్లాడుతూ ప్రతి సంవత్సరం జూలై 11వ తేదీన న జనాభా దినోత్సవం కార్యక్రమం జరుగుతుందని ఈ సంవత్సరం ప్రణాళిక బద్ధమైన మాతత్వం కోసం గర్భాధారణల మధ్య ఆరోగ్యకరమైన సమయం అంతరం అనే సూక్తిని ప్రభుత్వం సూచించిందని తెలిపారు. దాని ప్రకారం ప్రసవంనకు ప్రసవానికి మధ్యలో సమయం పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సరాబు సునీల్, డాక్టర్ డి సునిత సిబ్బంది పాల్గొన్నారు.

అవగాహన ర్యాలీ

ఉండి: తల్లీ బిడ్డా జీవితాంతం ఆరోగ్యంగా ఉండాలంటే బిడ్డకు బిడ్డకు మధ్య ఎడమ ఉండాలని ఉండి పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ పీఎల్ సునంద అన్నారు. ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉండి పీహెచ్‌సీ వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సునంద మాట్లాడుతూ మనిషి ఆరోగ్యంగా ఉండాలంటే పుట్టిన నాటి నుంచి వైద్యాధికారుల సూచనలు, సలహాలు పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు సీహెచ్‌ఓ కృష్ణకుమార్, హెప్సీ కుమారి, కృష్ణవేణి, షర్లీ, అనూష, శాంతి, స్పందన, శృతి, ఆశా తదితరులు పాల్గొన్నారు.

కుటుంబ నియంత్రణ పాటిద్దాం


ర్యాలీని ప్రారంభిస్తున్న జిల్లా వైద్యాధికారి గీతాబాయి

భీమవరం (ప్రకాశంచౌక్): ప్రజలు కుటుంబ నియంత్రణ పట్ల అవగాహన కలిగి ఉండాలని జిల్లా వైద్యాధికారి డా.జి.గీతాబాయి తెలిపారు. శుక్రవారం ప్రపంచ జనాభా దినోత్సవం పురస్కరించుకొని భీమవరంలో డా.బి.ఆర్ అంబేడ్కర్ సర్కిల్ నుంచి తహసీల్దార్ కార్యాయలం వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి డాక్టర్ జి.గీతాబాయి మాట్లాడుతూ ప్రతి ఏటా జూలై 11న ప్రపంచ జనాభా దినోత్సవం జరుపుకుంటున్నట్లు తెలిపారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ ఈ ఏడాది మహిళలు శారీరికంగా, మానసికంగా ఆరోగ్యంగా ఉన్నప్పుడే గర్భాదారణ గురించి ఆలోచించాలని తెలియజేసిందన్నారు. చిన్న కుటుంబాలు ఉన్నప్పుడే దేశం పురోభివృద్ధి చెందుతుందని తెలిపారు. మాతృ, శిశు శ్రేయస్సు కోసం సరైన సమయంలో గర్భధారణ, బిడ్డ బిడ్డకు మధ్య అంతరం ఉండేటట్లు అవగాహన కల్పించే విధంగా వైద్య సిబ్బంది కృషి చేయాలని సూచించారు. ఆరోగ్య సంరక్షణ, నాణ్యమైన విద్య, ఉద్యోగాల నైపుణ్యం కోసం జనాభా నియంత్రణ అత్యవసరమని దీని ప్రభావం ఆర్థికాభివృద్ధిపై స్పష్టంగా పడుతుందని ఆమె అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డా.దేవసుధ లక్ష్మి, ఎస్.హెచ్.ఎం డిపిఎంఓ డా.ధనలక్ష్మి, ఆర్.బి.ఎస్.కే ప్రోగ్రాం అధికారి, ఇన్‌చార్జి పరిపాలన అధికారి డా.భావన, యస్.టి.ఆర్ వైద్య సేవలు సమన్వయాధికారి డా.కీర్తి, గణాంక అధికారి యం.ఎస్ ప్రసాద్, డిటిహెచ్ఎస్ఓ వెంకట రమణ, జిల్లా కార్యాలయం వివిధ విభాగాల సిబ్బంది, యుపీహెచ్‌సీల మెడికల్ ఆఫీసర్లు, ఏఎన్ఎంలు, ఆశాలు, జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ నోడల్ అధికారి విజయలక్ష్మి, సీడీపీఓ లక్ష్మి కాంతం, శ్రీ విజ్ఞాన వేదిక కన్వీనర్ చెరుకువాడ రంగ సాయి, భీమవరం మథర్ నర్సింగ్ కాలేజీ నర్సింగ్ విద్యార్థులు, రెడ్ క్రాస్ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

మధ్యవర్తిత్వం వల్ల సమయం, డబ్బు ఆదా



సమావేశంలో మాట్లాడుతున్న జడ్జి సుధారాణి

భీమవరం: మధ్యవర్తిత్వం వల్ల కక్షిదారుల సమయం, డబ్బు ఆదా అవుతాయని చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న కేసులు రాజీ చేసుకోవచ్చని భీమవరం సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) ఎం సుధారాణి అన్నారు. మధ్యవర్తిత్వంపై నిర్వహిస్తున్న అవగాహన సమావేశాల్లో భాగంగా శుక్రవారం మండల న్యాయ సేవాసంస్థ ఆధ్వర్యంలో మధ్యవర్తి న్యాయవాదులు, ప్యానల్ న్యాయవాదులు, పారా లీగల్ వాలంటీర్లు, కక్షిదారులకు ఏర్పాటుచేసిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. మధ్యవర్తిత్వంపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ ప్రచారం చేయాల్సిన అవసరముందన్నారు. ఈ కార్యక్రమంలో మధ్యవర్తిత్వ న్యాయవాదులు ఆర్ హరి, కేబీ రాజశేఖర్, జీవీ స్టీఫెన్‌బాబు, కెవిజయలక్ష్మి, ఎస్ మాణిక్యాలరావు, న్యాయవాదులు బి సురేష్ కుమార్, డి రవికిరణ్, కె జ్యోతి, బి లోకేశ్వరరావు, ఎన్ సుధీర్, పి అంబేడ్కర్, పారా లీగల్ వాలంటీర్స్ కె చంద్రరావు, ఎస్ సత్యనారాయణరాజు తదితరులు పాల్గొన్నారు.

లంకపేటలో మంచినీటి కోసం ఆందోళన


లంకపేట వద్ద మంచినీటి కోసం ఖాళీబిందెలతో ఆందోళన చేస్తున్న దృశ్యం

భీమవరం: భీమవరం మున్సిపాలిటీ 38 వార్డు లంకపేట ప్రాంతంలో గత నాలుగు రోజుల నుంచి మంచినీరు సరఫరా చేయకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సీపీఎం భీమవరం పట్టణ కార్యదర్శి బి వాసుదేవరావు ఆందోళన వ్యక్తం చేశారు. మంచినీరు కోసం లంకపేట ప్రాంతంలో శుక్రవారం ఖాళీ బిందెలతో మహిళలు నిరసన వ్యక్తం చేసిన సందర్భంగా వాసుదేవరావు మాట్లాడారు. మే నెల నుంచి లంకపేట ప్రాంత ప్రజలకు సక్రమంగా నీరు సరఫరా చేయడం లేదని తాగునీటి కోసం ప్రజల తీవ్ర ఇబ్బందులు పడుతున్నా మునిసిపల్ అధికారులు స్పందించలేదని విమర్శించారు. దుర్గాపురం వాటర్ ట్యాంకు ప్రారంభించిన తర్వాత లంకపేట ప్రజల నీటి కష్టాలు తీరతాయని ఆశిస్తే మరింత పెరిగాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల మంచినీటి కష్టాలను మునిసిపల్ కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లగా తాత్కాలికంగా వాటర్ ట్యాంక్‌లు ఏర్పాటు చేయించి, సమస్య శాశ్వతపరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారన్నారు. ఆందోళనలో సీపీఎం నాయకులు పాల్గొన్నారు.

తిరువన్నామలై ట్రైన్ హాల్ట్‌పై హర్షం

వీరవాసరం: నరసాపురం- తిరువన్నామలై రైల్వే ట్రైను వీరవాసరం రైల్వే స్టేషన్ లో హాల్ట్ ఏర్పాటు చేయడం పట్ల మండల ప్రజానీకం శుక్రవారం హర్షం వ్యక్తం చేశారు. నరసాపురం నుంచి ట్రైన్ బయలుదేరిన సమయంలో రాష్ట్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ దృష్టికి వీరవాసరం రైల్వే స్టేషన్లో హాల్ట్ విషయాన్ని వీరవాసరం నాయకులు తెలియజేయడంతో రైల్వే ఉన్నతాధికారులతో మాట్లాడి హాల్ట్‌ను ఇప్పించడం ఆనందించదగ్గ విషయమని అధ్యక్షుడు వెంద్ర దివాకర్ తెలిపారు.

మద్యం స్వాధీనం

ఆకివీడు: మండలంలోని చెరుకుమిల్లి గ్రామంలో ఆరు మద్యం బాటిళ్లు కలిగి ఉన్న రాజులపాటి దుర్గా ప్రసాద్‌ను శుక్రవారం అదుపులోకి తీసుకుని అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ సీఐ ఎం.శ్రీనివాసరావు తెలిపారు. దాడుల్లో ఎస్ఐ కరుణ శ్రీ, సిబ్బంది ఉన్నారు.

ఏఎంసీ చైర్మన్‌గా వెంకట్రావు

ఆకివీడు: ఆకివీడు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా బొల్లా వెంకట్రావును నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కోఆప్షన్ సభ్యులుగా ఆకివీడు నగర పంచాయతీ చైర్‌పర్సన్ జామి హైమావతి, ఏడీఎం, జిల్లా మార్కెటింగ్ అధికారి ఉన్నారు.

ఎస్ఆర్‌కేఆర్ పూర్వ విద్యార్థుల రజతోత్సవ వేడుకలు


ఎస్ఆర్‌కేఆర్ రజతోత్సవ వేడుకల్లో పూర్వ విద్యార్థులు

భీమవరం: భీమవరం ఎస్ఆర్‌కెఆర్ ఇంజనీరింగ్ కళాశాల 1996 బ్యాచ్ ఇంజనీరింగ్ పూర్వ విద్యార్థుల రజతోత్సవ వేడుకలు శుక్రవారం కళాశాలలో నిర్వహించారు. కళాశాల ఈఈఈ హెడ్ బిఆర్‌కె వర్మ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పలువురు విద్యార్థులు మాట్లాడుతూ తాము దేశంలోను, ప్రపంచవ్యాప్తంగా అనేక సంస్థల్లో ఉన్నత స్థానాల్లో ఉన్నామంటే అధ్యాపకులు అందించిన బోధనే కారణమన్నారు. పూర్వ విద్యార్థులు రజతోత్సవ వేడుకలకు అమెరికా, ఆస్ట్రేలియా, యూకే వంటి దేశాల నుంచి కూడా హాజరయ్యారు. కళాశాల సెక్రటరీ కమ్ కరస్పాండెంట్ సాగి రామకృష్ణ నిశాంత్‌వర్మ, ఉపాధ్యక్షుడు సాగి విఠల్‌రంగరాజు, ప్రిన్సిపల్ కెవి మురళీకృష్ణంరాజు మాట్లాడుతూ దేశంలోనేగాకుండా ప్రపంచంలో పలు ప్రాంతాల్లో సాఫ్ట్‌వేర్ రంగం, చిప్ డిజైన్ వంటి ప్రతిష్ఠాకరమైన సంస్థల్లో ఉన్నత స్థానాల్లో ఉన్న తమ విద్యార్థుల ప్రగతి చూస్తుంటే తమకు ఎంతో ఆనందంగా ఉందన్నారు. అనంతరం కళాశాల పాలకవర్గం, పలువురు అధ్యాపకులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో వి బుగ్గారావు, భాస్కరరెడ్డి, పి కాంతారావు ఎన్ శ్రీనివాస్, కె వి విశ్వనాథ రాజు,ఎన్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కాకినాడ జీజీహెచ్ సంఘటనపై కఠిన చర్యలు తీసుకోవాలి


జ్యోతిరెడ్డి, మెప్మా మాజీ అధ్యక్షురాలు

ఆకివీడు: కాకినాడలోని జీజీహెచ్ ఆసుపత్రిలో పరీక్షలు చేయించుకునేందుకు వచ్చిన విద్యార్థినులపై లైంగిక వేధింపులకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని వైఎస్సార్ సీపీ మహిళా నాయకురాలు, మెప్మా మాజీ అధ్యక్షురాలు మోరా జ్యోతిరెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం ఆమె జీజీహెచ్ సంఘటనపై తీవ్రంగా స్పందించారు. వైద్యం కోసం వచ్చేవారిపై ఇటువంటి లైంగిక దాడులు చేయడం సరికాదన్నారు. ఆసుపత్రులు దేవాలయాలకన్నా పవిత్రమైనవని అందులో పనిచేసే వారు మానవత్వం నింపుకుని ఉండాలన్నారు. మహిళలపై అత్యాచారాలు, దౌర్జన్యాలు, లైంగిక వేధింపులు కొనసాగడం దారుణమన్నారు. ప్రభుత్వం మహిళలకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు.

మావుళ్లమ్మ ఆలయంలో విశేష పూజలు

భీమవరం (ప్రకాశంచౌక్): పట్టణంలోని మావుళ్లమ్మ దేవస్థానంలో ఆషాడ బహుళ పాడ్యమి సందర్భంగా ధాన్య లక్ష్మి పూజలు బ్రహ్మ శ్రీమద్దిరాల మల్లికార్జున శర్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని విశేషంగా అలకరించారు.

కేసు నమోదు

ఆకివీడు: ఆకివీడు మండలం నగర పంచాయతీ మేనేజర్ దంగేటి వెంకటేశ్వరరావు 10వ తేదిన 11.30 గంటలకు నగర పంచాయతీ ఆఫీస్ నందు ఉండగా సదరు నగర పంచాయతీ ఆఫీస్ వద్దకు ఆకివీడుకి చెందిన ఎండీ మస్తాన్‌వలి మాజీ ఏఎంసీ చైర్మన్ ఆకివీడు ఎండీ భాసిత్ అను వారు వచ్చి మేనేజర్‌తో గొడవపడి అసభ్యకరంగా మాట్లాడి వారి విధులకు ఆటంకం కలిగించారని మేనేజర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ హెచ్ నాగరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.